సాక్షి నంద్యాల

శుక్రవారం । 20 । జనవరి । 2023



గోసంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి కర్నూలుకు చెందిన ఆవుల మురళీ మోహన్‌రెడ్డి గురువారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు.



భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబా దేవికి గురువారం మూలనక్షత్రం సందర్భంగా ఊయలసేవను నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,619.89
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:61,015
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,483

న్యూస్‌రీల్

శ్రీహరి రూపుడా.. సిరిగల దేవుడా

- అహోబిలేశుడికి భక్తిశ్రద్ధలో పూజలు



ఉత్సవ పల్లకీలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లదవరదస్వామి

ఆళ్లగడ్డ: శ్రీహరి రూపుడా శ్రీలక్ష్మీ లోలుడా .. సిరిగల దేవుడా నరసింహస్వామీ.. అందుకో మా పూజలు అంటూ మండలంలోని ఆర్.క్రిష్ణాపురం గ్రామస్తులు ఉత్సవ మూర్తులకు విన్నవించుకున్నారు. ఉత్సవ పల్లకీలో కొలువైన జ్వాలా నరసింహాస్వామి, ప్రహ్లాదవరద స్వాములకు గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా తన వివాహ వేడుకలకు ఆహ్వానించడంలో భాగంగా ఆయా తేల్పుల వద్ద ఉత్సవ పల్లకీ కొలువుంచి భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రాదాలను అందజేశారు.

నేడు కోటకొందుకూరులో..

పార్వేట ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవ పల్లకీ కోటకందుకూరు గ్రామంలోకి ప్రవేశించనుంది. ఇప్పటికే గ్రామస్తులంతా పార్వేట ఉత్సవాలకు సిద్ధమయ్యారు.

22న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 22న జరగనున్నాయని జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వంశీధర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు 35 ఏళ్లు నిండిన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గెలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్నారన్నారు. వివరాలకు కోచ్ నాగార్జునరెడ్డి 8985809434 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

22న ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్షలు

నంద్యాల(సిటీ): ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) పబ్లిక్ పరీక్షలు ఈ నెల 22న జరగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆశా వర్కర్లకు ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం పూర్తయినందున వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు 22న పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఓబీఈ లెవల్-ఏ (3వ తరగతి), ఓబీఈ లెవల్-బీ (5వ తరగతి), ఓబీఈ లెవెల్-సీ (8వ తరగతి) అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు.

డీసీసీబీకి మరో 29 బ్రాంచ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నూతనంగా 29 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే డీసీసీబీకి 23 బ్రాంచీలు ఉన్నాయి. కొత్తగా మాధవరం, గడివేముల, సంజామలలో శాఖలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఈ ప్రతిపాదనను ఆప్కాబ్ ఆమోదించి నాబార్డుకు పంపింది. ఇవి కాకుండా మరో 29 బ్రాంచీల ఏర్పాటుకు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలను ఆప్కాబ్‌కు పంపారు. నూతనంగా 29 బ్రాంచీలు ఏర్పాటైతే డీసీసీబీకి మండలానికి ఒక శాఖ ఉన్నట్లు అవుతుంది.

చివరి మజిలీ స్వర్గధామం

గతంలో ఇలా..

నంద్యాల జిల్లా కేంద్రంలో ఐదు హిందూ శ్మశాన వాటికలు ఉండగా, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొండయ్య హిందూ శ్మశాన వాటిక అందులో ఒకటి. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించడం అంటే ప్రత్యక్ష నరకమే. బురదలో అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టమే. పందులు, కుక్కలతో నిండి ఉంటుంది. చుట్టుపక్క జులాయిలు కొందరు సమాధులపై కూర్చొని మద్యం సేవిస్తూ పేకాట ఆడటం జరుగుతుండేది. ఇక సారా విక్రయాలు కూడా చేసేవారు. రాత్రిళ్లు వ్యభిచారం జరుగుతుండగా లెక్కలేనని సార్లు పోలీసు దాడులు జరిగాయి. మృతదేహాన్ని పూడ్చిన కొద్ది గంటలకే జంతువులు తవ్వి బయటకు తీయడం.. అస్థికలు చెల్లాచెదురుగా పడి ఉండటం చూస్తే ప్రాణం చచ్చిపోతుంది. మరీ దారుణం ఏమిటంటే.. దహనం చేయడానికి కాటికాపరులు టైర్లు, కిరోసిన్ వినియోగించడం. అంత్యక్రియలకు వెళ్లిన వాళ్లు కనీసం అక్కడ 10 నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి.

ఇప్పుడు ఇలా..

బతికినప్పుడు ఎలా ఉన్నా.. చనిపోయిన తర్వాత అయినా గౌరవప్రదంగా సాగనంపాలనే తలంపుతో పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి, స్థానిక వైద్యులు ఒక అడుగు ముందుకేశారు. స్థానిక పీవీనగర్ వద్దనున్న 7 ఎకరాల మున్సిపల్ స్థలంలో అత్యాధునిక వసతులతో శ్మశాన వాటిక నిర్మాణం తలపెట్టారు. మొదట రూ.కోటి అంచనా వేసి వారి వద్దనున్న కొంత డబ్బుతో పాటు దాతల సహకారం తీసుకున్నారు. అది నేడు రూ.5 కోట్ల వరకూ చేరి పట్టణంలో స్వర్గధామంగా రూపుదిద్దుకుంది. ఇక్కడ అడుగడుగునా ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. ఆధ్యాత్మిక చిత్రాలు మనసును కట్టిపడేస్తాయి. అధునాతన యంత్రాలు, అత్యాధునిక పద్ధతిలో నిర్మించిన శ్మశాన వాటికలో సాంప్రదాయ పద్ధతుల నడుమ అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. సమీపంలోని పీవీ నగర్ గుడిసెవాసులకు ఈ స్వర్గధామం నుంచే ప్రతి రోజు మినరల్ వాటర్‌ను ఉచితంగా అందిస్తుండటం విశేషం.



శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుని ప్రతిమ

మూఢనమ్మకాలను దాటుకొని..

అంత్యక్రియలను ఎంతో పవిత్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలనే శివకుమార్‌రెడ్డి సంకల్పానికి మొదట్లో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. అప్పటికే శ్మశాన వాటికను అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన ఇద్దరు దాతలు అకాల మృత్యువాత పడటం చూసి శ్మశానాలు అభివృద్ధి చేస్తే ప్రాణాలు పోతాయనే మూఢనమ్మకంలో ఉండిపోయారు. వాళ్ల ఆలోచనలో మార్పు తీసుకొచ్చేందుకు తనే ముందుడుగు వేశారు. మూఢనమ్మకాలను చెల్లాచెదురు చేశారు. నవ నిర్మాణ సమితిగా ఏర్పాటై నిర్మించిన స్వర్గధామం ప్రస్తుతం అభివృద్ధి చెందిన శ్మశాన వాటికల్లో రాష్ట్రంలోనే రెండవదిగా నిలిచింది.



నంద్యాల శివారులోని పీవీ నగర్ వద్ద నిర్మించిన స్వర్గధామం



హరిశ్చంద్ర ఘాట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన శివకుమార్‌రెడ్డి ప్రభుత్వ అధికారి. 2008లో కర్నూలు, అనంతపురం జిల్లాలకు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్‌గా సేవలందించారు. తన స్నేహితుడి తండ్రి మృతిచెందటంతో అంత్యక్రియల కోసం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న కొండయ్య హిందూ శ్మశాన వాటికకు వెళ్లారు. అక్కడ బురదలో నడుచుకుంటూ వెళ్లి పందులు సంచరిస్తున్న ప్రదేశంలో మృతదేహాన్ని టైర్లతో కాల్చడం చూసి ఆయన మనసు చలించింది. తన స్నేహితుడి తండ్రి సమాజంలో ఎంతో ఉన్నతంగా బతికిన వ్యక్తి.. మరణానంతరం ఇంతటి దుర్భరమైన ప్రదేశంలో అంత్యక్రియలు జరగడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఆ బాధలో నుంచి పుట్టుకొచ్చిందే 'స్వర్గధామం'. ఈయనకు పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ మధుసూదన్‌రావు ప్రతి అడుగులో తోడుగా నిలిచారు. ఇద్దరూ కలిసి మరికొంత మందితో నవ నిర్మాణ సమితిని ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ చేయూత

స్వర్గధామంలో ప్రభుత్వం రూ.95 లక్షలతో ఎల్‌పీజీ దహన వాటిక నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పనులు పూర్తి దశకు చేరుకోవటంతో మరి కొన్ని రోజుల్లో అందుబాటులోకి రానుంది. గ్యాస్ ద్వారా దహన కార్యక్రమాలు చేయటం వల్ల శ్మశాన వాటికలో ఉపయోగించే విద్యుత్, కర్రల వినియోగం పూర్తిగా తగ్గుతుంది. దాతల సహకారంతో పాటు నంద్యాల మున్సిపాలిటీ నిధుల నుంచి రూ.2 కోట్ల మేర పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లతో పాటు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేశారు.

ఆధునిక హంగులతో శ్మశానవాటిక

- ఏడు ఎకరాల్లో నిర్మాణం
- దాతలతో పాటు మున్సిపాలిటీ సహకారం
- ప్రభుత్వం తరఫున రూ.95లక్షలతో ఎల్‌పీజీ దహన వాటిక
- ఉచితంగానే అంతిమ సంస్కారాలు



అస్థికలు భద్రపరిచే లాకర్‌లు



నూతనంగా నిర్మిస్తున్న ఎల్‌పీజీ దహన వాటిక

'స్వర్గధామం' ప్రత్యేకతలు..

- శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం.
- మొక్కల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం.
- మృతదేహాలను ఇంటి నుంచి తరలించేందుకు రెండు వైకుంఠ రథాలు.
- అంత్యక్రియలు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అక్కడే అందుబాటులో ఉంచారు.
- దహన సంస్కారాలకు కర్రలు, నెయ్యి, కర్పూరం వినియోగం.
- అత్యాధునిక కరెంట్ దహన వాటికలు.
- అంత్యక్రియల కోసం వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులు కూర్చునేందుకు వీలుగా విజిటర్స్ గది నిర్మాణం.
- అంత్యక్రియలకు రాలేని వారి కోసం ఇంటర్‌నెట్ సహాయంతో అత్యాధునిక కెమెరాల ద్వారా లైవ్‌లో వీక్షించే వెసలుబాటు.
- హరిశ్చంద్ర ఘాట్‌లో సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాల నిర్వహణ.
- అంత్యక్రియల తర్వాత అక్కడే స్నానం చేసేందుకు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా టాయ్‌లెట్లు.
- పిండప్రదానం, హోమాల నిర్వహణకు ఒక భవనం.
- అస్థికలు భద్రపరుకునేందుకు ప్రత్యేకంగా లాకర్లు.
- తాగునీటి సౌకర్యానికి ప్రత్యేకంగా మినరల్ వాటర్ ప్లాంట్.

ఇప్పటి వరకు 202 అంతిమ సంస్కారాలు

స్వర్గధామం శ్మశాన వాటిక 2020 డిసెంబర్‌లో ప్రారంభమైంది. ఇప్పటి వరకు 202 అంతిమ సంస్కారాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైకుంఠ రథాలు మొదలుకొని, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు.. ఇంత ధర అని ఖరారు చేయలేదన్నారు. ఎవరినీ డబ్బు అడగమని, అయితే ఉన్న వాళ్లు మనస్ఫూర్తిగా ఎంత ఇచ్చినా తీసుకొని శ్మశాన వాటిక అభివృద్ధికి వినియోగిస్తామన్నారు.

శ్మశానాలు దేవాలయాలతో సమానం



బతికి ఉన్నప్పుడు ఎంత గొప్పగా జీవించారో, చనిపోయిన తర్వాత అంతే గొప్పగా అంత్యక్రియలు జరపటం వారి సంతతి బాధ్యత. అందుకోసమే స్వర్గధామం ఏర్పాటుకు కృషి చేశాం. శ్మశాన వాటికలంటే తమ పెద్దలు నివసించే దేవాలయాలుగా భావించారు. అక్కడ పరిశుభ్రత, ఆధ్యాత్మికత, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొన్నప్పుడే ప్రశాంతంగా సాగనంపినట్లు అవుతుంది.

– శివకుమార్‌రెడ్డి, నంద్యాల నవనిర్మాణ సమితి అధ్యక్షులు

గౌరవప్రదంగా సాగనంపాలి



కుటుంబంలోని వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయే సమయంలో ఎంతో గౌరవప్రదంగా సాగనంపాలి. బిడ్డ పుట్టినప్పుడు ఎంత సంతోషంగా ప్రేమ, ఆప్యాయతలు చూపుతామో.. చనిపోయినప్పుడు కూడా అలాంటి వాతావరణమే ఉండాలి. స్వర్గధామం నిర్మాణంలో దాతల చేయూత మరువలేనిది. ఇక్కడి కల్పించిన సౌకర్యాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉండటం ఆనందాన్నిస్తోంది.

– డాక్టర్ మధుసూదన్‌రావు, మధుమణి హాస్పిటల్స్ నిర్వాహకులు

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

పాణ్యం: గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ శుక్రవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరిశీలించారు. గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో గిరిజనులతో గవర్నర్ ముఖాముఖీ కార్యక్రమం ఉండటంతో అక్కడి ఏర్పాట్లను గురువారం సాయంత్రం వారు పరిశీలించారు. కలిసికట్టుగా గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరెడ్డి, జెట్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వీటీడీఏ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో సమావేశమై గవర్నర్ పర్యటన బందోబస్తుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఎస్పీ రమణ, ఏఆర్ డీఎస్పీ సుంకురయ్య, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ రామాంజినాయక్, దిశా డీఎస్పీ మారుతిరావు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై సలహాల స్వీకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్(2023–24 సంవత్సరానికి) ప్రతిపాదనలపై సలహాలు, అభ్యంతరాలను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ స్వీకరించింది. విశాఖపట్నం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో కూడా సలహాలు, సూచనలు తెలపవచ్చని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్/మెయిల్‌లో ముందుగా రిజిష్టర్ చేసుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు కర్నూలు విద్యుత్ భవన్, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు పాల్గొన్నారు.

వేమన పద్యాలు.. చైతన్య వీచికలు



వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహక బృందం

శ్రీశైలం: వేమన పద్యాలు చైతన్య వీచికలని రెడ్ల సంక్షేమ సంఘం సభ్యులు గోల్మారు తాతిరెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గోల్మారు తాతిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు ప్రతి ఒక్కరికి సులభంగా అర్థమవుతాయన్నరు. ప్రతి పద్యంలో లోక నీతి, సామాజిక చైతన్యం ఉంటుందన్నారు. తెలుగు వర్సిటీ పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా కొండవీటి ప్రాంతానికి చెందిన వేమన పూర్తి పేరు పైడిపాల పుల్లారెడ్డి అని అన్నారు. బ్రౌన్ దొర ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తకం రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయన్నారు. సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయాలకు హత్తుకునేలా పద్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు తోడేటి నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కాతా రామిరెడ్డి, మేనేజర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏమైందమ్మా.. లేమ్మా!

లేద్దామంటే శరీరం సహకరించదు..

తిందామంటే మేత లేదు.. యజమాని ఎక్కడో తెలియదు.. చుట్టూ ఎవరూ కనిపించరు.. అంబా అని అరిచినా పట్టించుకునే దిక్కు లేదు. మలమూత్రాలు చేస్తున్న చోట అలా కూలబడిపోయింది ఓ గోమాత. ఒకటి కాదు, రెండు కాదు, ఐదు రోజులు గడిచిపోయింది. అరిచీ అరిచీ నీరసించింది. ఓ దూడ తల్లి చుట్టూ తిరుగుతోంది. తల్లికి ఏమైందో తెలియక అక్కడక్కడే తచ్చాడుతోంది. మౌనంగా రోదిస్తూ.. తల్లికేసి చూస్తూ అలా నిల్చుండిపోతోంది. ఏమైందమ్మా.. లేమ్మా.. అన్నట్లు దీనంగా చూస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

ఐదు రోజులుగా నరకయాతన

- గోమాత వెనుక కాలికి గాయం
- ఊరి చివర జొన్న చేనులో ఘటన
- తల్లికి ఏమైందోనని దూడ వేదన
- ఎట్టకేలకు స్పందించిన చుట్టుపక్క రైతులు
- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవతో చికిత్స



గాయంతో కూలబడిన ఆవు వద్ద దీనంగా నిల్చొని చూస్తున్న దూడ



గోవును సంచారవాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: అది మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారు ప్రాంతం. చుట్టూ పొలాలే తప్ప నివాస ప్రాంతాలు కనిపించవు. ప్రతిరోజూ రైతులు పొలం పనులు చేసుకుని వెళ్తున్నారు. అయితే ఎక్కడి నుంచో ఓ ఆవు అరుపులు వినిపిస్తున్నా, మంద నుంచి తప్పిపోయి ఉంటుందనుకుని మళ్లీ పనుల్లో ఉండిపోయారు. ఇలా ఐదు రోజులు గడిచిపోయాయి. జొన్న పైరు కావడంతో ఏపుగా పెరగడం, పొలం మధ్యలో ఆవు పడిపోవడంతో రైతులు గుర్తించే అవకాశం లేకపోయింది. చివరకు ఇక్కడే ఎక్కడో ఉన్నట్లుగా అనుమానించి అందరూ వెతకడంతో ఎట్టకేలకు గురువారం ఆనవాలు లభించింది. దగ్గరికి వెళ్లి చూడగా కుప్పకూలిన ఓ ఆవు, దాని పక్కనే దూడ కనిపించాయి. ఆవు వెనుక కాలు విరిగి గాయమవడంతో అక్కడే కూలబడింది. దూడ వయస్సు కూడా పది రోజులకు మించి ఉండదని తెలుస్తోంది. ఈ రెండూ ఐదు రోజులుగా నరకం అనుభవించాయి. ఈ దృశ్యం చూసి చలించిన రైతులు వెంటనే ఆవు, దూడకు నీళ్లు తాపించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం గుర్తుకు వచ్చి 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బందికి నిముషాల్లో అక్కడికి చేరుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం సర్జరీ కోసం ఆవుతో పాటు దూడను వాహనంలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కదిలించింది. మారుమూల ప్రాంతానికి సంచార వాహనం రావడం.. మూగజీవి వేదన తీర్చే ప్రయత్నం చేయడం అందరి అభినందనలు అందుకుంది.

మేఘాల మహానందం



మహానంది ఆధ్యాత్మిక క్షేత్రానికి శ్వేత వర్ణపు మేఘాలు తోడవడంతో భక్తులు మహానందం పొందారు. చేతికందుతాయా అన్నంత రీతిలో ఉన్న నీలాకాశం, తెల్లటి మేఘాలు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులను అబ్బురపరిచాయి. గురువారం ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– మహానంది

హెల్మెట్ తప్పనిసరి




ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు (టౌన్): ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్‌ను ధరించాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కర్నూలు రోడ్డు రవాణా శాఖ, కర్నూలు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కంట్రోల్‌రూమ్, రాజ్‌విహార్, కలెక్టరేట్, సి. క్యాంప్ సెంటర్, బిర్లాగేట్, బంగారుపేట, కిడ్స్ వరల్డ్ మీదుగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ రక్షణ కవచమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఉప రవాణా కమిషనర్ శ్రీధర్, రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం పాల్గొన్నారు.



గర్భాశయంలో రాచపుండు

- పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు
- క్యాన్సర్ కేసుల్లో 20 శాతం మందికి ఇదే సమస్య
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 వేల మందికి సమస్య
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స



గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను తెలిపే చిత్రం

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్‌ను పూర్వకాలంలో రాచపుండుగా పిలిచేవారు. ఈ వ్యాధి ధనికులకే వస్తుందని అప్పట్లో దానికి ఆ పేరు వచ్చింది. కానీ ఇప్పుడు ఈ వ్యాధికి పేద, ధనిక అన్న తేడా లేకుండా అందరికీ సోకుతోంది. చాలా మంది మహిళలకు ఈ వ్యాధి వచ్చినట్లే తెలియదు. వ్యాధి ముదిరిపోయిన తర్వాత దాని తాలూకు లక్షణాలు ప్రారంభమై అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. దీంతో ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జనవరి నెలను గర్భాశయ ముఖద్వార అవగాహన మాసంగా నిర్వహించాలని ఆదేశించింది. ఈ సంవత్సరం 'కొన్ని తరాలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అంతం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పెరిగిన వైద్యులు

రెండు దశాబ్దాల క్రితం రాయలసీమ కంతటికీ కర్నూలులో ఒక్కరే క్యాన్సర్ వైద్యులుండేవారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పాతికమందికి క్యాన్సర్ డాక్టర్లున్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 60 నుంచి 80 మంది కొత్తగా క్యాన్సర్ బాధితులు వస్తున్నారు. అలాగే ప్రతిరోజూ 10 నుంచి 15 మందికి కీమోథెరపి, 25 మందికి రేడియోథెరపి చేస్తున్నారు. నిత్యం 80 నుంచి 120 మంది ఇన్‌పేషంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో 20 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సెర్వికల్ క్యాన్సర్) బాధితులున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 40 వేల వరకు ఉంటుందని వైద్యుల అంచనా.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు విశ్వభారతి, ఒమెగా, శాంతిరామ్ హాస్పిటల్‌లలో క్యాన్సర్ వ్యాధులకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. అలాగే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించేందుకు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. ఈ పథకం లేనప్పుడు రోగులకు లక్షల రూపాయలు ఖర్చు అయ్యేది. అన్ని ఆసుపత్రుల్లో క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులకు ఆసరా పథకం కింద రోజుకు రూ.225, నెలకు రూ.5వేలు తక్కువ కాకుండా ప్రభుత్వం అందజేస్తోంది.

సెర్వికల్ క్యాన్సర్ ఎందుకు వస్తుందంటే..

ఈ క్యాన్సర్ ప్రధానంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పీవీ) కారణంగా వస్తుంది. తక్కువ వయస్సులో వివాహం చేయడం, లైంగిక సంబంధాలు కొనసాగించడం, స్త్రీ, పురుషులిద్దరిలో బహుళ లైంగిక భాగస్వాములుగా ఉండటం, ముందస్తు ప్రసవాలు, ఎక్కువ మంది పిల్లలను కనడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఈ క్యాన్సర్ రావడానికి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. ఇది ప్రధానంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సుగల స్త్రీలను ప్రభావితం చేస్తుంది.

లక్షణాలు ఇవీ..

- సాధారణ రుతుక్రమం గాకుండా యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం (మెనోపాజ్)
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మలవిసర్జనలో ఆటంకాలు

ఇలా చేస్తే నివారణ సాధ్యం

2020లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ క్యాన్సర్ నిర్మూలన కోసం ప్రపంచ కార్యాచరణ ప్రణాళికను అందించింది. దీనికింద 2030 నాటికి 90 శాతం కౌమార బాలికలకు 15 సంవత్సరాల వయస్సులోపు హెచ్‌పీవీ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయాలి. 70శాతం మహిళలు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సుగల కలిగిన వారికి కచ్చితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. గర్భాశయ పూర్వ క్యాన్సర్‌తో బాధపడుతున్న 90 శాతం మహిళలకు తగిన చికిత్స అందించాలి.

ముందుగా గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు



దేశంలో ప్రతి సంవత్సరం కొత్తగా 1,24,000 మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు నమోదవుతున్నారు. వారిలో సగం మంది ఒక సంవత్సరంలోపు మరణిస్తున్నారు. ఈ క్యాన్సర్ వల్ల ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ మరణిస్తోంది. దీనికి నివారణగా 30 ఏళ్ల వయస్సు నుంచి లైంగికంగా చురుకుగా ఉన్న మహిళలందరూ 5 నుంచి 10 ఏళ్లకు ఒకసారి హెచ్‌పీవీ పరీక్ష చేయించుకోవాలి. 9 నుంచి 26 సంవత్సరాల వయస్సుగల బాలికలందరికీ హెచ్‌పీవీ టీకాలు వేయాలని సూచించాలి. ఈ వ్యాధిని నయం చేయడం కంటే నివారణ ఉత్తమం. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు.

–డాక్టర్ శిల్పారెడ్డి, గైనకాలజిస్టు, కర్నూలు

ల్యాప్రోస్కోపి ద్వారా శస్త్రచికిత్స



నయం కాని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ల్యాప్రోస్కోపి పరికరం ద్వారా ఆధునిక పద్ధతిలో శస్త్రచికిత్స చేయవచ్చు. దీని వల్ల కోత, కుట్లు ఉండదు. త్వరగా ఎవరి పనులు వారు చేసుకోవచ్చు. హెర్నియా వచ్చే అవకాశం కూడా ఉండదు. సాధారణంగా వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుంది. దీనివల్ల వివాహం అయిన మహిళలు ప్రతి సంవత్సరం పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకుంటే, క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించగలిగితే నయం చేసుకోవచ్చు. దీనికితోడు కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి 70 నుంచి 80శాతం వరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.

–డాక్టర్ సి. వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, కర్నూలు

ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు సిమ్‌కార్డులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని 77 మంది ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు ఏడీఏ సాలురెడ్డి సిమ్‌కార్డులను పంపిణీ చేశారు. ఉద్యాన భవన్‌లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కర్నూలు సబ్ డివిజన్‌లో కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రబీ పంటల నమోదు పూర్తి కావచ్చిందని, రైతుల ఈ–కేవైసీపై దృష్టి సారించాలన్నారు. ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవోలు శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, రవిప్రకాశ్ కర్నూలు సబ్ డివిజన్ కార్యాలయం సాంకేతిక ఏవో దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులూ.. ఈ కేవైసీ చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులు ఈ నెల 20వ తేదీలోపు సీఎఫ్ఎంఎస్ ఐడీని ఆధార్, మొబైల్ నంబరుతో ఈ–కేవైసీ చేసుకోవాలని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రామచంద్రరావు తెలిపారు. జిల్లాలో 36,905 మంది ఉద్యోగులు ఉండగా ఇప్పటి వరకు 12,334 మంది మాత్రమే అనుసంధానం చేసుకున్నారని పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ట్రెజరీ అధికారుల సమావేశంలో ఈ–కేవైసీపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీవో జయలక్ష్మి, ఎస్‌టీవోలు అంజాద్‌పాషా, పలనాటి సునీల్, సీఎఫ్‌ఎంఎస్ సీనియర్ అకౌంటెంటు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాతో అన్నదమ్ముల ఆత్మహత్యాయత్నం

- పొలంలోనే పురుగుల మందు తాగిన వైనం
- పరిస్థితి విషమం.. కర్నూలుకు తరలింపు



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయ రాజేష్, బోయ రమేష్‌లు



పొలంలో పురుగుల మందు తాగుతున్న బోయ రాజేష్, బోయ రమేష్

ఎమ్మిగనూరు రూరల్: తాము సాగులో ఉన్నా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాకుండా ట్రాక్టర్‌తో పంటను దున్నిస్తున్నారని అన్నదమ్ములు పొలంలోనే పురుగుల మందు తాగిన ఘటన ఎమ్మిగనూరులో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలో నివాసముండే బోయ నరసన్న గుడేకల్ గ్రామానికి చెందిన నరసమ్మకు చెందిన సర్వే నంబర్ 145, 146, 148/సీలో 7.92 ఎకరాల భూమిని 1986లో కొనుగోలు చేశారు. అయితే అగ్రిమెంట్ మీదుగా ఇప్పటి వరకు బోయ నరసన్న కుటుంబ సభ్యులు సాగులో ఉన్నారు. గుడేకల్ గ్రామానికి చెందిన నరసమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 2020లో నరసమ్మ కుమారుడు మోహనకృష్ణకు ముగ్గురు అక్కలు ఉన్నా తాను ఒక్కడే సంతానం అని చెప్పి తహసీల్దార్ కార్యాలయంలో అక్రమంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందటమే కాకుండా సాగులో ఉన్న భూమిని మిగులు భూమిగా చూపించి ఆన్‌లైన్ చేయించుకున్నాడు. అక్రంగా ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించుకొని కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, భాస్కర్ల చంద్రశేఖర్, వై.శ్రీనివాసగౌడ్, పెబ్బేటి శ్రీనివాసరెడ్డి, బి.చంద్రకళలకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించాడు. మోహన్‌కృష్ణ అక్కలు తమకు భాగం ఇవ్వకుండా ఎలా విక్రయిస్తావని గొడవపడటంతో విషయం బయటపడింది. సాగులో ఉన్న బోయ నరసన్న 1986లోనే తాము కొనుగోలు చేశామని.. ఇప్పుడు తమకు తెలపకుండా ఎలా విక్రయిస్తావని మోహన్‌కృష్ణను ప్రశ్నించగా ఎవరికైనా చెప్పుకోండని బెదిరించాడు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. మూడు సార్లు జిల్లా ఎస్పీకి వినతి ఇచ్చినా స్పందించటం లేదని చెపుతున్నారు. 2020 నుంచి సమస్య కొనసాగుతోంది. పొలంలో మొక్కజొన్న సాగుచేయగా ఈ నెల 17వ తేదీన అక్రమంగా విరుపాక్షి రెడ్డి అనుచరులు ట్రాక్టర్ తెచ్చి పంటను కోసుకెళ్లారు. మరలా శుక్రవారం ట్రాక్టర్‌తో పొలం దున్నటానికి వచ్చిన విషయం తెలుసుకున్న బోయ నరసన్న కుమారులు బోయ రాజేష్, బోయ రమేష్‌లు పొలం దగ్గరకు వెళ్లి ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. అక్రమంగా తమ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవటమే కాకుండా, కోర్టు స్టే ఇచ్చినా పంట పొలంను కోసుకొని, దున్నటానికి వస్తారా అంటూ తమతో తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాలను తీసి పొలంలోనే తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ఇద్దరు అన్నదమ్ములను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి ప్రభుత్వాసుపత్రికి చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసుకుంటామని టౌన్ ఎస్‌ఐ మస్తాన్‌వలి తెలిపారు. భూ వివాదం కోర్టులో ఉందని చెప్పారు.

పేదల బియ్యం పక్కదారి

- నూకలుగా మార్చి.. అధికారులను ఏమార్చి
- అక్రమ రవాణాకు అడ్డాగా బనగానపల్లె



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

బనగానపల్లె: పేదల బియ్యం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి సేకరించి నూకలుగా మార్చి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాకు బనగానపల్లె అడ్డాగా మారి అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రతి కార్డుదారుడికి ప్రభుత్వం నెలకు ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తోంది. వీటిని పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు తక్కువ ధరకు సేకరించి నూకలుగా మార్చి ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారం యథేచ్ఛగా సాగుతుండటంతో రైస్ మిల్లులు కూడా పుట్టగొడుగుల్లా వెలిశాయి. గతంలోనూ రేషన్ బియ్యం ఇక్కడి నుంచే కర్ణాటకలోని పలు ప్రాంతాలకు పెద్ద ఎత్తున్న రవాణా అయ్యేది. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో భయందోళన చెందిన వ్యాపారులు కొంత తగ్గించినా ఇప్పుడు నూకల అక్రమ రవాణాకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

రూ.7కు కొని.. రూ.20కి విక్రయించి..

కార్డుదారుల నుంచి చిల్లర వ్యాపారులు కిలో రేషన్ బియ్యం రూ.7 నుంచి రూ.8లకు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.10 విక్రయిస్తున్నారు. వారు అక్రమంగా నిల్వ ఉంచుకుని రాత్రి వేళ రైస్ మిల్లులకు చేర్చుతున్నారు. మిల్లుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న మిషన్ల ద్వారా నూకలుగా మార్చి తెల్లవారేసరికి వాహనాల ద్వారా నెల్లూరు పోర్టుకు తరలిస్తున్నారు. రోజు 500 నుంచి 600 క్వింటాళ్ల వరకు తరలుతున్నాయి. అక్కడ కిలో నూకలు రూ.20 నుంచి రూ.22 పలుకుతున్నట్లు సమాచారం.

అధికారుల భయం లేదు..

నిబంధనల ప్రకారం నూకలను పోలీసులు, విజిలెన్స్ అధికారులు సీజ్ చేయడానికి వీలులేదు. చట్టంలోని ఈ లోసుగులను తెలుసుకున్న వ్యాపారులు నూకల అక్రమ రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం 300 క్వింటాళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని పరిశీలించారు. అందులో నూకలు ఉన్నందున వదిలేశారు. రైస్ మిల్లులపై ప్రత్యేక నిఘా ఉంచి నూకలు ఆడించక ముందే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా నూకలను పరీక్షించి పీడీఎస్ బియ్యానికి చెందినవా లేదా అనేది గుర్తించవచ్చని బనగానపల్లె మార్కెట్‌యార్డు కార్యదర్శి సుందర్‌రాజు అన్నారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి

- సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్



కప్పట్రాళ్ల గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్

ఆలూరు: ప్రతి వ్యక్తి మంచి ప్రవర్తనతో మెలగాలని సెబ్ అడిషినల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ అన్నారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామాన్ని గురువారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతం గ్రామంలో పలు విషయాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అందరూ కలసిమెలసి జీవించాలన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. అడిషన్ ఎస్పీ వెంట పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు, సివిల్, సెబ్ పోలీసులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు, జరిమానా

కర్నూలు(లీగల్): కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన పఠాన్ ఇమ్రాన్ ఖాన్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.కేశవ్ గురువారం తీర్పు చెప్పారు. 2020 సెప్టెంబర్ 6వ తేదీన మహ్మద్ రఫి అనే వ్యక్తిపై నిందితుడు పఠాన్ ఇమ్రాన్ ఖాన్ దాడి చేసి హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు వాదించారు. జరిమానాలో రూ.10 వేలు ఫిర్యాదుదారుడు, సహబాధితుడికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.